

'మధ్యవర్తిత్వం'తో మంచి ప్రయోజనాలు
● సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవచ్చు
● ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి
డిగ్రీ పరీక్షల షెడ్యూల్ విడుదల
8
పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి
● సీజీఎస్‌టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి
● కొండవీడులో స్వచ్ఛత పఖ్వాడా 2025 కార్యక్రమం

గణతంత్ర వేడుకలకు సిద్ధం



పోలీసు కవాతు మైదానంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు

నరసరావుపేట, జనవరి 25 (ఆంధ్ర జ్యోతి): గణతంత్ర వేడుకలకు కలెక్టరేట్ సమీపంలోని పోలీసు కవాతు మైదా నాన్ని ముస్తాబు చేశారు. వేడుకల సందర్భంగా నూ తనంగా నిర్మించిన పోలీసు పరేడ్ గ్రౌండ్‌ను ప్రారం భించనున్నారు. కవాతు మైదానంలో వేడుకల నిర్వహ ణకు భారీగా ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ పీ అరుణ్ బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షిం చారు. ఆదివారం ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్నాయి. కలెక్టర్ అరుణ్‌బాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసు, ఎన్‌సీసీ దళాలచే గౌరవ వం

ముస్తాబైన పోలీసు పరేడ్ గ్రౌండ్

దనం స్వీకరిస్తారు. వివిధ ప్రభుత్వ శాఖల శకటాలను ప్రదర్శిస్తారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేయ నున్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటుకు సిద్ధం చేశారు. విద్యా, గృహ నిర్మాణ, పౌరసరఫరాలు, వ్యవ సాయ, వైద్య ఆరోగ్య తదితర శాఖల శకటాలను ప్రద ర్శించనున్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్



అర్హులందరూ ఓటు హక్కు పొందాలి

● అవగాహనతో సద్వినియోగం చేసుకోవాలి ● ఓటరు దినోత్సవంలో కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన అర్హులందరూ ఓటు హక్కు పొందాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు తెలిపారు. స్థానిక ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్ హాల్‌లో శనివారం జరిగిన ఓటరు దినోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య విలువలు కాపాడేందుకు ఓటు హక్కు సార్వత్రిక ఎన్నికలకు స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు అందరూ సహకరించాలన్నారు. కళాశాలల్లో ఓటరు నమోదుపై అవగాహన క్లబ్‌లు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 7 నియోజకవర్గాలకు 7 మంది ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులను నియమించామన్నారు. సీనియర్ ఓటర్లు బొల్లిశెట్టి శివయ్య, నాగేశ్వరరావులను సత్కరించారు. కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి ఓటరు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. గత ఎన్నికల్లో ఓటు హక్కు వినియో గించుకున్న



ఓటరు దినోత్సవ ర్యాలీలో కలెక్టర్ అరుణ్‌బాబు, వివిధ శాఖల అధికారులు

దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కుపై అవగాహన కలిగి, ఆ హక్కు ను సద్వినియోగం చేసుకోవా లన్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో జిల్లాలో 17.30 లక్షల మంది ఓటు హక్కు పొందగా, వారిలో 8.80 లక్షల మంది మహిళలు ఉన్నారని తెలిపారు. జిల్లాలో ఇంకా సుమారు 40 వేల నుంచి 50 వేల వరకు ఓటు హక్కు పొందాల్సిన వారున్నారన్నారు. అవగాహన లోపంతో చాలామంది ఓటు హక్కు పొందలేక పోతున్నారని చెప్పారు. ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టినప్పుడు విధిగా అందరూ ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న ట్రాన్స్‌జెండర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఓటుహక్కుపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు.

పట్టణంలో ప్రదర్శన

ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్‌లో ర్యాలీని కలెక్టర్ ప్రారంభించి పాల్గొన్నారు. అక్కడ నుంచి భువనచంద్ర టౌన్‌హాల్ వరకు జరిగిన ప్రదర్శనలో విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్య క్రమంలో ఆర్డీవో మధులత, మెప్మా అధికారి సిద్ధ లింగమూర్తి, మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు,తహసీల్దారు వేణుగోపాల్ పాల్గొన్నారు.

మిర్చికి.. నల్లతామర

◆ తెగుళ్లతో రైతుల విలవిల
◆ రోజు మార్చి రోజు మందుల పిచికారి
◆ ఎకరాకు రూ.1.50 లక్షల వరకు వ్యయం
◆ భారీగా దిగుబడులు తగ్గుతాయని ఆందోళన



నల్ల తామర సోకిన మిరప మొక్క

నల్ల తామర.. మిర్చి పంటను వీడటంలేదు. ఈ ఏడు కూడా పురుగు పూత దశలోనే ఆశించింది. నల్ల తామర పురుగు మిరప రైతులను నలిపే స్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో నల్లతామర ఉధృతంగా ఉంది. నల్ల తామరతో పాటు నల్ల, తెల్ల, పచ్చ నల్లి, ఆకు ముడత తెగుళ్లు మిర్చి పంటకు సోకాయి. నల్ల తామర వల్ల పూతతో పాటు కాయలు రాలిపో తున్నాయి. మొక్కలు ఎండిపోతున్నాయి. నల్ల తామరకు తోడు తెగుళ్ల నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పురుగు మందుల కోసం ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు రైతులు ప్రత్యేకంగా ఖర్చు చేస్తున్నారు. పంటను కాపాడు కోవడానికి రోజు మార్చి రోజు మందులు పిచికారి చేయాల్సి వస్తోంది. మందులు పిచికారి చేస్తున్నా ఫలితం ఉండటం లేదని రైతుల వాపోతున్నారు. తెగుళ్లు పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడులు కూడా తిరిగిరావని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఈ ఏడు పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 1,66,768 ఎకరాల్లో మిరప పంట సాగైంది. పల్నాడు జిల్లాలో 1,02,881 ఎకరాల్లో, బాపట్ల జిల్లాలో 25,337 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 38,550 ఎకరాల్లో మిరప సాగు చేశారు. తేజ, వండర్‌హాట్, చపాటా వంటి రకాలను ఎక్కువగా సాగు చేశారు. పంట పూత, కాపు దశలో తెగుళ్ల బెడద మొదలైంది.

ధర లేక దిగాలు..

తెగుళ్లను అధిగమించి పండించిన మిరపకు మార్కెట్‌లో ధర లేదు. దీంతో రైతులు దిగాలు పడ్డారు. ధర తగ్గడంతో పాటు కొనుగోళ్లు జరగక పోవడంతో మిర్చి రైతులు సంక్షోభంలో చిక్కుకున్నారు. అప్పులు చేసి పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కడంలేదు. తేజ రకం క్వింటాల్ ధర రూ.13 వేల లోపే ఉంది. గత సీజన్‌లో కల్లాల్లోనే తేజ రకం క్వింటాల్ రూ.19 వేల వరకు కొనుగోలు చేశారని రైతులు చెబుతున్నారు. మిర్చికి గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మందులు.. సూచనలు లేవు

మిర్చి పంటకు ఆశించే తెగుళ్ల నివారణకు నిర్దిష్ట పురుగు మందులు లేవు. దీంతో ఇతర పంటలకు వాడే మందులనే తప్పనిసరి పరిస్థితుల్లో వాడుతున్నారు. పంట యాజమాన్య పద్ధతులు, పురుగు మందులు వినియోగంపై రైతులకు అధికారులు సూచించడంలేదు. దీంతో ప్రైవేట్ కంపెనీలు లాభాల కోసం అనేక రకాల పురుగు మందులను సిఫార్సు చేస్తున్నాయి. వాటిని వాడి రైతులు మరింతగా నష్టపోతున్నారు.

కొన్ని చోట్ల ఆకుముడత, మచ్చ తెగుళ్లతో మొక్కల్లో ఎదుగుదల లేదు. కాయ దశలో వైరస్, నల్ల, పచ్చ, తెల్ల నల్లి సోకడం తో కాయ ఎండి రాలిపోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మొక్కలు వేసిన మొదల్లో ఆకుముడత వైరస్ వాహకంగా ఉండే తెల్లదోమ, ఆ తదుపరి నల్ల తామర, వైరస్ వల్ల దిగుబడి గణనీయంగా త గ్గు తోంద ని రైతులు తెలిపారు. పంటను తెగుళ్లు మింగే స్తుం డటంతో రైతులు కన్నీటి పర్యంత మవుతున్నారు. పొడి వాతావరణం వల్ల ప్రస్తుతం నల్ల తామర పురుగు ఉధృతి పెరుగుతున్నది.



తెగుళ్లతో ఎండిన మిరప మొక్కలు



మిరప పొలంలో ఏర్పాటు చేసిన బంక అట్టకు నల్లి పురుగులు

పురుగు నివారణ చర్యలు

నల్ల తామర మూడేళ్ల మిరప పంటను ఆశించి నష్ట పరుస్తోంది. వాతావరణం ఉష్ణోగ్రతలు 20 నుంచి 30 డిగ్రీలు ఉన్నప్పుడు దీని ఉధృతి అధికంగా ఉంటుంది. ఈ పురుగులు ఆకుల కింద వైపు, పువ్వులలో ఎక్కువ సంఖ్యలో చేరతాయి. పత్రహరితం గీకడం, రసం పీల్చడంతో కణజాలం దెబ్బతింటోంది. దీంతో ఆకులు మాడిపోయి, పువ్వులు గోధుమ రంగులోకి మరి రాలిపోతాయి. కాయ తయారయ్యే దశలో పిల్ల పురుగులు ఎక్కువగా ఆశించి రసం పీలుస్తాయి. కాయలు గట్టిగా, గిడస బారి ఇటుకరాయి రంగులోకి మారిపోతాయి. గుడ్లు.. లార్వా.. ప్యూపా.. తల్లి దశలో పురుగు నివారించడానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలి.

● గుడ్డు దశలో ఆకు అడుగు భాగం తడిచేలా వేప నూనె పిచికారి చేయాలి. గుడ్లు పగలకుండా ముర్గిపోతాయి.

● లార్వా దశలో గుడ్లు నుంచి పిగిలిన లార్వా మొక్క కింద నేలపై పడుతుంది. మొక్క మొదళ్లలో వేప పిండి వేసుకుని నివారించవచ్చు.

● ప్యూపా దశ నెల ఉంటుంది. ఈ సమయంలో వేప పిండి లేదా వేప నూనె మొక్క మొదళ్లలో వేసుకుని నివారించవచ్చు.

● ప్యూపా దశ నుంచి రెక్కలు వచ్చిన తల్లి పురుగు నెల నుంచి మొక్క మీదకు ఎగిరే దశలో ఎకరాకు సుమారు 20 నీలి రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలి. పురుగులు నీలి రంగుకు ఆకర్షితమై జిగురు అట్టలకు అంటుకుని చని పోతాయి.

మార్చి మార్చి పిచికారి చేయాలి

నాలుగు దశల్లో నివారణ చర్యల అనంతరం చివరిగా పురుగు మందులను పిచికారి చేసుకోవాలి. తొలుత తక్కువ సామర్థ్యంతో ప్రారంభించి ఎక్కువ పవర్ ఉన్న పురుగు మందులను పిచికారి చేసుకోవాలి. ఆ మందులను కూడా మార్చి మార్చి పిచికారి చేసుకోవాలి. డైమీథోయేట్ లీటర్ నీటికి రెండు ఎంఎల్ కలిపి పిచికారి చేయాలి. ఫిప్రొనిల్ లీటరుకు 2 ఎంఎల్, ఫిప్రొనిల్ + ఇమిడా క్లోప్రిడ్ లీటరుకు రెండు ఎంఎల్, బ్రోప్లానీలైడ్ ఎకరాకు 32 ఎంఎల్, ఫ్లూక్స మెటమైడ్ ఎకరాకు 160 ఎంల్ పిచికారి చేయాలి.

- సీహెచ్‌వీ రమణారెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి, పల్నాడు



నల్ల తామర సోకిన మిరప పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి రమణారెడ్డి

మమ్మల్ని లెక్క చేయడం లేదు

● ఎక్కడ ఉంటారో.. ఏమిచేస్తారో తెలియడం లేదు
● సచివాలయం సిబ్బందిపై ఎంపీడీవోల ఫిర్యాదులు
● తహసీల్దార్లు చెప్పిందే కలెక్టర్లు చేస్తున్నారని ఆరోపణ
● శిక్షణ కార్యక్రమంలో గళమెత్తిన మండల అభివృద్ధి అధికారులు

మండల స్థాయిలో ఎంపీడీవోలే కలెక్టర్లు : జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా



మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ క్రిస్టినా

గుంటూరు సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 'మమ్మల్ని అసలు లెక్క చేయడం లేదు. ఎనర్జీ అసిస్టెంట్.. సర్వేయర్.. వాళ్లొక ప్రత్యేకమైన వారిలా ప్రవర్తిస్తారు. అసలు వారెక్కడ ఉంటారో.. ఏమి చేస్తారో తెలియదు. సర్వేల్లో ఎవరెవరు వెనుక బడి ఉన్నారో ఆధారాలతో చూపిస్తా ఉంటే కలెక్టర్లు మేము చెప్పింది పట్టించుకోరు. తహసీల్దార్లు ఏది చెబితే అదే వాళ్లు(కలెక్టర్లు) వింటున్నారు. చేస్తున్నారు. మా బాధలు ఎన్నని చెప్పాలి..' అంటూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎంపీడీవో(మండల అభివృద్ధి అధికారులు)లు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీవోలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. సీఈవో జ్యోతిబసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా పాల్గొని ప్రసంగించారు. మండల స్థాయిలో ఎంపీడీవోలే కలెక్టర్లని ఆమె చెప్పారు. ఎమ్మెల్యేల ఒత్తిడి ఉందని జడ్పీ ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నా కొందరు అధికారులు చూస్తూ కూర్చుంటున్నారన్నారు. కాకుమాను మండలంలో తీర్మానప్రతులను చించి కొత్త వాటిని చేర్చారంటే దానికి ఎవరిని బాధ్యులను చేయాలని ప్రశ్నించారు. ప్రొటోకాల్ వ్యవహారంలో మూడేళ్లుగా పోరాటం జరుగుతూనే ఉందన్నారు. చివరకు జిల్లా పరిషత్ నిధులు ఇచ్చినా చైర్‌పర్సన్ పేరు లేకుండా శిలాఫలకం తయారు చేస్తుంటే ఎంపీడీవోలు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఏమి జరిగిందో.. ఇప్పుడు అదే జరుగుతుందన్నారు. ఎంపీడీవో ఉమా దేవి మాట్లాడుతూ ఏఏ సందర్భంలో ఎవరి పేర్లు శిలాఫలకంపై వేయాలన్న అంశంపై ప్రభుత్వ ఉత్తర్వులు స్పష్టంగా ఉన్నాయని, కొందరు ఏఈలే గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. జీవో ప్రకారం శిలాఫలకంపై అధికారులు, కాంట్రాక్టర్ల పేర్లు వేయించాల్సిన పనిలేదన్నారు. ప్రొటోకాల్ ప్రకారం పేర్లు వేయించడానికి తాము యుద్ధం చెయ్యాల్సి వస్తుందని నూజెండ్ల, తాడికొండ ఎంపీడీవోలు తెలిపారు. ఈ సమస్య పరిష్కారం కోసం డీఈలతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. కొందరు ఏఈలే ప్రొటోకాల్ వ్యవహారంలో ఎమ్మెల్యేలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. జడ్పీ నుంచి మండలాలకు వస్తున్న నిధుల వివరాలు తమకు రావడం లేదని రాజుపాలెం ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. ఏఈల దయాదాక్షిణ్యాలపై నిధుల సమాచారం మండల పరిషత్‌కు చేరుతుందన్నారు. నిధులు ఎక్కడ కేటాయించాలో నిర్ణయించాల్సింది మండల పరిషత్ పాలకవర్గం అయితే.. ఏఈల అత్యుత్సాహం వల్ల ఆ పని ఎమ్మెల్యేలు చేస్తున్నారని పలువురు ధ్వజమెత్తారు. నిధులు జడ్పీ నుంచి తీసుకున్నా ఫొటోలు మాత్రం ఎంపీ, ఎమ్మెల్యేలవి పెద్దవిగా వేస్తున్నారన్నారు. మండల స్థాయిలో ఎంపీడీవో కన్వీనర్‌గా ఏర్పాటు చేసిన జడ్పీ ఆస్తుల పరిరక్షణ కమిటీ సమావేశం ఎక్కడా జరగడం లేదని, ఆ సమావేశాలు ఎప్పుడు ఏర్పాటు చేశారో చెప్పాలని చైర్‌పర్సన్ ఎంపీడీవోలను ప్రశ్నించారు. మండలపరిషత్ కార్యాలయాల్లో ప్రభుత్వం చెప్పినట్లుగా ఈ-ఆఫీసు తప్పనిసరిగా అమలు చేయాలని సీఈవో తెలిపారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. సమా వేశంలో డిప్యూటీ సీఈవో కృష్ణ పాల్గొన్నారు.

బైబిల్ మిషన్ మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు

● నేటి నుంచి 29 వరకు నిర్వహణ
● సకల జనులకు సదుపాయాలు
● మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్

8



భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

చిట్.. చీట్



● బోర్డు తిప్పేస్తున్న వ్యాపారులు
● నరసరావుపేటలో వరుస సంఘటనలు
● మూడేళ్లలో రూ.400 కోట్లకు పైగానే ఎగవేత

నరసరావుపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అత్యవసరంగా అక్కరకు వస్తాయి.. నెలనెలా కట్టి ఏకమొత్తంగా వాడుకోవచ్చు.. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో వడ్డీ తక్కువ.. అని మదుపరులు ఆలోచిస్తుండగా అదే అదనుగా చిట్, వడ్డీ వ్యాపారులు చీటింగ్ చేస్తున్నారు. తినీతినక మదుపరులు నెలనెలా చిట్లు కడుతుండగా వ్యాపారులు రూ.కోట్లలో కొల్లగొట్టి పారిపోతున్నారు. నరసరావుపేట పట్టణంలో చిట్ల వ్యాపారులు బోర్డు తిప్పేస్తున్నారు. వరుస సంఘటనలతో మదుపరులు తీవ్రంగా నష్టపోతున్నారు. రిజిస్టర్డ్ చిట్ కంపెనీలు కూడా మోసాల జాబితాలు ఉన్నాయి. ఇలా పట్టణంలో మూడేళ్ల వ్యవధిలో రూ.400 కోట్లకు పైగా సొమ్మును ఎగవేశారని అంచనా. వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు వ్యాపారులు బోర్డు తిప్పేయగా కలకలం సృష్టించాయి. అరండల్‌పేటలోని ఓ షాపింగ్ కాంప్లెక్స్ ఉన్న వ్యాపారి రూ.100 కోట్లకు అప్పులు చేసినట్లు సమాచారం. సదరు వ్యాపారి తనకు ఉన్న ఆస్తులను అప్పులు ఇచ్చిన వారికి పంచి ఇస్తున్నట్లు, ఆస్తులు రూ.85 కోట్ల మేర ఉన్నట్లు సమాచారం. పల్నాడు రోడ్డులో చిట్, రియల్ ఎస్టేట్ వ్యాపారి పెద్ద మొత్తంలో మదుపరుల నుంచి డిపాజిట్లు సేకరించాడు. టర్నోవర్ రూ.కోట్లల్లో ఉండగా నష్టాలకు గురయ్యానంటూ రెండు రోజులుగా కార్యాలయానికి రాకపోతుండటంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఆయనకు అప్పులు లెక్కకు మించి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యాపారి దగ్గర ఎంత డిపాజిట్లు ఉన్నాయి.. చిట్లు కట్టిన వారికి ఏ మేరకు చెల్లించాలన్న లెక్కలు ఇంకా తేల లేదు. ఏడాది క్రితం చిట్ వ్యాపారులు ముగ్గురు దాదాపు రూ.30 కోట్లకు ఎగవేసినట్లు తెలుస్తోంది. ఓ పురుగు మందుల వ్యాపారి రూ.50 కోట్లకు పైగా అప్పులు ఎగ్గొట్టినట్లు బాధితులు చెబుతున్నారు. పట్టణంలో ఇలాంటి సంఘటనలు వరుసగా వెలుగు చూస్తున్నా అధికారులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవన్న విమర్శలున్నాయి.

అడహాక్ కమిటీ అధ్యక్షుడిగా బండి



నూతనంగా ఎంపికైన జిల్లా ఎంపీడీవోల సంఘం అడహాక్ కమిటీ

గుంటూరు సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా ఎంపీడీవోల సంఘం అడహాక్ కమిటీ అధ్యక్షుడిగా బండి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం ఈ ఎన్నిక జరిగింది. ఎన్నికలు జరిగే వరకు ఈ అడహాక్ కమిటీ ఉనికిలో ఉంటుందని నాయకులు ప్రకటించారు. కమిటీ సభ్యులుగా తొమ్మిది మంది ఎంపీడీవోలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు ఎంపీడీవోలు మాట్లాడుతూ వివిధ విభాగాలకు చెందిన పనులను ఎంపీడీవోలు పర్యవేక్షించాల్సి రావటంతో పని భారం పెరుగుతుందని అన్నారు. దీనివలన పంచాయతీరాజ్‌కు సంబంధించిన ముఖ్య విషయాలపై దృష్టి సారించడం సాధ్యం కావటం లేదన్నారు. తద్వారా మండల పరిపాలనకు ఆటంకం ఏర్పడుతుందని చెప్పారు. నూతనంగా ఎన్నుకున్న అడహాక్ కమిటీ ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీవోల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు.

డిగ్రీ పరీక్షల షెడ్యూల్ విడుదల

పెదకాకాని, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ కోర్సులో 4వ సెమిస్టర్ విద్యార్థులకు రెగ్యులర్, సప్లమెంటరీ లతోపాటు 4వ సెమిస్టర్‌లో వన్ టైం ఆపర్చునిటీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు సీఈ ఆలపాటి శివప్రసాదరావు తెలిపారు. ఫిబ్రవరి 20వ తేదీలోగా సంబంధిత విద్యార్థులు ఫీజులు చెల్లించాలన్నారు. రూ.100 అపరాధంతో ఫిబ్రవరి 24వ తేదీలోగా ఫీజు చెల్లించవచ్చన్నారు. థియరీ పరీక్షలు మార్చి 25వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని వివరించారు. ఫీజుల వివరాలు, పరీక్షల షెడ్యూల్ డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ. ఏఎన్‌యూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చునని సీఈ తెలిపారు.

ఎంహెచ్‌ఆర్‌డీ ప్రాజెక్టు పరిశీలన

పెదకాకాని, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫిజిక్స్ విభాగంలో నిర్వహిస్తున్న ఎంహెచ్‌ఆర్‌డి ల్యాబ్‌ను పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం (పీఎఫ్ఎంఎస్)కు చెందిన ప్రతినిధులు నితీష్ కుమార్, దివ్యాన్స్ శనివారం సందర్శించారు. ఎం.హెచ్.ఆర్.డి ప్రాజెక్టులో భాగంగా నిధి స్కీమ్ కింద ఫిజిక్స్ విభాగం ఎంహెచ్‌ఆర్‌డి ల్యాబ్‌ను నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా ప్రాజెక్టు ప్రిన్సిపాల్, ఇన్వెస్టిగేటర్, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్. రవికుమార్ పీఎఫ్ఎంఎస్‌కి సంబంధించిన వివరాలను సభ్యులకు వివరించారు. పరిశోధనలు ఉత్తమ ఫలితాలు సాధిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఎఫ్ఎంఎస్ ప్రతినిధులను ఉద్దేశించి ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ఎం.హెచ్.ఆర్.డి ప్రాజెక్టు విజయవంతంగా పూర్తి చేసేందుకు విశ్వవిద్యాలయం కూడా పూర్తి సహాయ, సహకారాలు అందిస్తుందని వివరించారు.

బైబిల్ మిషన్ మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు

- నేటి నుంచి 29 వరకు నిర్వహణ
- సకల జనులకు సదుపాయాలు
- మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్



మహోత్సవాల ముఖద్వారం

పెదకాకాని, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బైబిల్ మిషన్ 87వ మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేసినట్లు బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్ శనివారం తెలిపారు. భక్తులకు సకల సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. మహోత్సవాలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కేరళ, బీహార్, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు, సింగపూర్, మలేషియా, అమెరికా, దుబాయ్ దేశాల భక్తులు మహోత్సవంలో పాల్గొంటారని తెలిపారు.

మహోత్సవాల చరిత్ర

ఫాదర్ ఎం.దేవదాస్ జీవించి ఉన్న కాలంలో ప్రతి ఏడాది జనవరి 13, 14 తేదీల్లో గుంటూరు బేతేలు గృహ ఆవరణలో సభలు జరిగేవి. 1961 నుంచి కన్నా వారి తోటలోని క్రీస్తు దేవాలయ ఆవరణలో సభలు జరిగేవి. పెరుగుతున్న అసంఖ్యాక భక్తుల రద్దీతో గుంటూరు పరిధిలో పలు ప్రాంతంలో మహోత్సవాలు నిర్వహించారు. దాదాపు 1995 నుంచి నాగార్జున యూనివర్సిటీ ఎదుట మహోత్సవాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. బైబిల్ మిషన్ అధ్యక్షుడు, పెదకాకాని స్వస్థశాల నిర్వాహకులు రెవరెండ్. జె.శామ్యూల్ కిరణ్ 25 సంవత్సరాలుగా బైబిల్ మిషన్ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు.

భక్తులకు సకల సదుపాయాలు

మహోత్సవాల్లో పాల్గొనే భక్తులను దృష్టిలో పెట్టుకొని ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించారు. నిత్య అన్న సంతర్పణతోపాటు మంచినీటి సౌకర్యం, సాధారణ అవసరాలకు నీటిని ఏర్పాటు చేశారు. రోజువారి అవసరాలు తీర్చుకునేందుకు ప్రత్యేకం సదుపాయాలు అందుబాటులో ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పూర్తిస్థాయిలో పోలీస్ అధికారుల పర్యవేక్షణతోపాటు ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది, వలంటరీలు కూడా భద్రత విధులు నిర్వహిస్తున్నారు. ప్రధాన కూడలి, సభా వేదికపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ, రైల్వే శాఖలవారు ప్రత్యేక రవాణా సదుపాయాలను కల్పించారు. ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకునేందుకు ప్రత్యేకంగా కమిటీలను నియమించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

- సీజీఎస్‌టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



బురుజు సమీపంలోని పరిసరాలను శుభ్రం చేస్తున్న సీజీఎస్‌టీ గుంటూరు కమిషనరేట్ అధికారులు

కొండవీడుకోట (యడ్లపాడు), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీజీఎస్‌టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి పిలుపు నిచ్చారు. స్వచ్ఛత.. పఖ్వాడా-2025 కార్యక్రమాల్లో భాగంగా సీజీఎస్‌టీ కమిషనరేట్ అధికారుల బృందం శనివారం కొండవీడుకోటలో స్వచ్ఛత.. ట్రెక్కింగ్ కార్యక్రమాలను నిర్వహించారు. గుంటూరుకు చెందిన ట్రెక్కింగ్ కింగ్స్ , డెకాథ్లాన్ సంస్థలతో కలసి చుక్కలకొండ బురుజుపైకి ట్రెక్కింగ్ నిర్వహించి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బురుజు సమీపంలోని ప్లాస్టిక్ వ్యర్థాలు, పర్యావరణానికి హాని కలిగించే చెత్త చెదారాలను తొలగించారు. స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ గుంటూరు కమిషనరేట్ పరిధిలో స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కమిషనరేట్ పరిధిలో పట్టుబడిన రూ.12.5 కోట్ల విలువైన గంజాయి, విదేశీ సిగరెట్లు, చైనీస్ వెల్లుల్లిని ఇటీవల దహనం చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీజీఎస్‌టీ గుంటూరు కమిషనరేట్ పరిధిలోని సిబ్బంది, ట్రెక్కింగ్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నంబూరులో 4 రైళ్లకు తాత్కాలిక నిలుపుదల సౌకర్యం

గుంటూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బైబిల్ మిషన్ మహాసభల దృష్ట్యా నంబూరు రైల్వేస్టేషన్‌లో నాలుగు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాత్కాలికంగా నిలుపుదల సౌకర్యం కల్పిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు మాత్రమే ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు. నంబరు 17282 నరసపూర్ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ ఉదయం 10.42కి నంబూరుకు వచ్చి 10.44కి బయలుదేరుతుంది. నంబరు 18281 గుంటూరు - నరసపూర్ రైలు సాయంత్రం 5.53కి నంబూరు వచ్చి 5.55కి బయలుదేరుతుంది. నంబరు 17016 సికింద్రాబాద్ - భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు రాత్రి 9.50కి వచ్చి 9.52కి, నంబరు 17015 భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ అర్ధరాత్రి దాటాక 12.30కి వచ్చి 12.32కి బయలుదేరుతుంది. అలానే ఒక అన్‌రిజర్వ్‌డ్ రైలుని కూడా నడపబోతున్నామన్నారు. ఈ నెల 26వ తేదీన వేకువజామున 5.30 గంటలకు నంబరు 07223 కాకినాడ టౌన్ - గుంటూరు ప్యాసింజర్ రైలు బయలుదేరి మధ్యాహ్నం 12.50కి గుంటూరుకు చేరుకొంటుంది. నంబరు 07224 గుంటూరు - కాకినాడ టౌన్ ప్యాసింజర్ రైలు ఈ నెల 29వ తేదీన మధ్యాహ్నం 1.50కి బయలుదేరి రాత్రి 8.40కి కాకినాడటౌన్‌కు చేరుకొంటుందన్నారు.

ఓటుతో ప్రజాస్వామ్య పరిరక్షణ



యూనివర్సిటీ మెయిన్ గేట్ ఎదుట విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

పెదకాకాని, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు కీలకపాత్ర పోషిస్తుందని ఏఎన్‌యూ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె. గంగాధరరావు సూచించారు. శనివారం 75వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఎలక్ట్రోలర్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో ఓటు అవగాహన, ఓటు ప్రాధాన్యత, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు పాత్రపై విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. విశ్వవిద్యాలయంలోని డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నుంచి వర్సిటీ ముఖద్వారం వరకు ర్యాలీ జరిగింది. ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభం అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ ప్లకార్డులు చేతపట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. విద్యార్థుల ర్యాలీని ఉద్దేశించి ఇన్‌చార్జ్ వీసీ గంగాధరరావు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, సీడీసీ డీన్ ఆచార్య వి.రవికుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య దివ్య తేజో మూర్తి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.జాన్సన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీలారాణి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సిద్దయ్య, అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, సీఎస్ఆర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నిరూపమ, ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ రవికుమార్, ఎన్‌సీసీ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ బి.బాలాజీ, ఎలక్ట్రోరల్ లిటరసీ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

'మధ్యవర్తిత్వం'తో మంచి ప్రయోజనాలు

- సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవచ్చు
- ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి

గుంటూరు(లీగల్), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వివాదాల పరిష్కారానికి 'మధ్యవర్తిత్వం' మంచి మార్గంగా రూపొందుతుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు జస్టిస్ రవినాథ్ తిల్హరి అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం గుంటూరు జింఖానా ఆడిటోరియంలో న్యాయవాదులకు 'మధ్యవర్తిత్వం' పై అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ ఎం.బబిత అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో జస్టిస్ తిల్హరి మాట్లాడుతూ సామాన్యుడికి కూడా సత్వర న్యాయం అందించటమే వ్యవస్థ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. కోర్టులో వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారంతో కోర్టులపై పని భారం తప్పుతుందనీ, తద్వారా న్యాయవ్యవస్థ మరింత సమర్థవంతంగా పని చేయవచ్చని అన్నారు. వాణిజ్య, వివాహ, కుటుంబ సంబంధమైన వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా సమర్థవంతంగా పరిష్కరించవచ్చని చెప్పారు. న్యాయవాదులు మధ్యవర్తిత్వంపై మెలకువలు నేర్చుకొని, తమ దగ్గరకు వచ్చే కక్షిదారులకు అవగాహన కల్పించి వారిని ప్రోత్సహించాలని సూచించారు. మధ్యవర్తిత్వంపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయవాదులకు శిక్షణ ఇచ్చేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఎం.బబిత మాట్లాడుతూ న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై నిపుణులచే శిక్షణ ఇప్పించి వారి నైపుణ్యాన్ని పెంచటం ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని 145 మండల లీగల్ సర్వీసెస్ కమిటీలు, 13 జిల్లా న్యాయ సేవాధికార సంస్థల నుంచి న్యాయవాదులు పాల్గొన్న కార్యక్రమంలో గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.మాలతి, న్యాయవాదులకు ఈ అంశంపై శిక్షణ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు మీడియేషన్ కమిటీ నియమించిన రిసోర్స్ పర్సన్‌లు రత్నతార, అరుణాచలం పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలికిన భాష్యం ప్రవీణ్



మంత్రి లోకేశ్‌కు పూల బొకే అందిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పూల బొకే అందించి స్వాగతం పలికారు. మంత్రి లోకేశ్ దావోస్ పర్యటన ముగించుకొని గన్నవరం విమానాశ్రయానికి శనివారం తెల్లవారు జామున 2 గంటలకు వచ్చారు. లోకేశ్‌ను కలిసి బొకే అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల నుంచి దావోస్‌కు వచ్చిన పెట్టుబడిదారులను ఆకట్టుకోవటంలో లోకేశ్ సఫలమయ్యారన్నారు.

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో నాలుగో స్థానం



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న పుదుచ్చేరి విద్యాశాఖ మంత్రి నమఃశివాయ, స్పీకర్ సెల్వం

బాపట్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో బాపట్ల జిల్లాకు నాలుగో స్థానం లభించింది. జిల్లాలోని సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయురాలు కొల్లి మోహనాంజలి ఆధ్వర్యంలో విద్యార్థులు చదలవాడ సాయిరాం ధీరజ్, కుంచాల వెంకటేష్ రూపొందించిన మల్టీ పర్పస్ అగ్రికల్చర్ మిషన్ నాలుగో స్థానంలో నిలిచింది. వీరికి పుదుచ్చేరి విద్యాశాఖ మంత్రి నమఃశివాయ, స్పీకర్ సెల్వం బహుమతి అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. భవిష్యత్తులో మరెన్ని ఉన్నత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అభినందించిన వారిలో జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, డిప్యూటీ డీఈవో జి.వెంకటేశ్వర్లు, ఎ.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

మాచవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మాచవరంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మాచవరంకు చెందిన అట్ల వెంకటేష్(34) ఈ నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు వారి బంధువుల గ్రామాల్లో విచారించినా ఆచూకీ తెలియలేదు. వెంకటేష్ తల్లి కృష్ణమ్మ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే శనివారం ఉదయం పిన్నెల్లి వెళ్లే దారిలో ఉన్న నేల బావిలో నుంచి వాసన వస్తున్నట్టు పొలాలకు వెళ్లిన కూలీలు గమనించి ఇరుగు పొరుగు వారికి చెప్పారు. ఈ విషయం వెంకటేష్ కుటుంబ సభ్యులకు చేరటంతో వారు వచ్చి మృతదేహాన్ని గుర్తించారు. ఎస్ఐ సతీష్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

మందకృష్ణకు పద్మశ్రీ

మాదిగ జాతికి దక్కిన గౌరవం

గుంటూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం లభించటం యావత్ మాదిగ జాతికి దక్కిన గౌరవంగా మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పద్మశ్రీ పురస్కారంనకు ఎంపికైన మందకృష్ణకు తాను శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

పురుగు మందు తాగి యువతి మృతి

దాచేపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ముత్యాలంపాడు గ్రామానికి చెందిన గుమ్మడి తేజశ్వని(17) పురుగు మందు తాగి శనివారం మృతి చెందింది. తేజశ్వని శుక్రవారం పురుగు మందు తాగగా గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెటింగ్ శాఖతోనే లైసెన్సు పునరుద్ధరణ

గుంటూరు సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న లైసెన్సు పునరుద్ధరణ వ్యవహారంలో అగ్నిమాపక శాఖకు ఏవిధమైన సంబంధం లేదని జిల్లా కోల్డ్ స్టోరేజ్‌ల యజమానులు స్పష్టం చేశారు. లైసెన్సు పునరుద్ధరణకు సంబంధించి అన్ని విషయాలను మార్కెటింగ్ శాఖ చూస్తుందని పేర్కొన్నారు. అగ్నిమాపక శాఖకు చెందిన అధికారులతో సంబంధం లేకుండానే లైసెన్సులు పునరుద్ధరించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారని తెలిపారు. జిల్లా అభివృద్ధి మండలి సమావేశంలో జరిగిన తీర్మానానికి అనుగుణంగా లైసెన్స్‌లు పునరుద్ధరించేందుకు అఫిడవిట్ తీసుకుంటారని తెలిపారు.

బావిలో వృద్ధురాలి మృతదేహం

గురజాలటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బావిలో వృద్ధురాలి మృతదేహం లభ్యమైన సంఘటన గురజాలలో చోటుచేసుకుంది. కారంపూడి రోడ్డులోని యాక్సిస్ బ్యాంకు పక్కన నిరుపయోగంగా ఉన్న బావిలో నుంచి శనివారం దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు వెళ్లి చూడగా వృద్ధురాలి మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించగా సీఐ భాస్కర్, ఎస్ఐ వినోద్‌కుమార్ మృతదేహాన్ని వెలుపలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. మృతురాలు తంగెడ గ్రామానికి చెందిన మేదర సుందరమ్మ (80)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆమెకు మతిస్థిమితం లేదనీ, తరచూ ఇంటి నుంచి వెళ్లి తిరిగి వస్తుండేదని కుటుంబ సభ్యులు తెలిపారు. గత మంగళవారం వెళ్లి తిరిగి రాలేదని చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	145,154,165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 36.83 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.



పురపాలక శాఖ మంత్రి నారాయణతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

పురపాలక శాఖ మంత్రితో ఎమ్మెల్యే కన్నా భేటీ

సత్తెనపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శనివారం విజయవాడలో కలిశారు. సత్తెనపల్లి పట్టణాన్ని దీర్ఘకాలంగా వేదిస్తున్న ముంపు సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేలా నాలుగు కిలో మీటర్ల వరకు వరద నీటి కాలువల నిర్మాణానికి అవసరమైన రూ.22 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. పట్టణంలోని రఘు రామ్‌నగర్, నరసరావుపేట రోడ్డు ప్రాంతాల్లో, పార్కుల అభివృద్ధికి, సత్తెనపల్లి, నరసరావుపేట రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా విస్తరణకు నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరారు. నియోజక వర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కన్నా పేర్కొన్నారు.

రూరల్ ఎస్ఐగా రవిబాబు

మాచర్ల రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మాచర్ల రూరల్ ఎస్ఐగా పోపూరి రవి బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గుంటూరు వీఆర్ నుంచి ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన నారాయణను గతంలో రాజుపాలెం స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించే సమయంలో సక్రమంగా విధులు నిర్వహించలేదని గుంటూరు వీఆర్‌కు పంపారు.

నేడు చెస్ టోర్నమెంట్

సత్తెనపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్‌సీఎం ఎలిమెంటరీ పాఠశాలలో చరితారెడ్డి డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం చెస్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పీ ఇర్మియ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, పాల్గొన దలచినవారు ఎవరి చెస్ బోర్డును వారే తెచ్చుకోవాలన్నారు. వివరాలకు 9440776995, 8897143142 నెంబరులో సంప్రదించాలని కోరారు.

టీడీపీ సీనియర్ నేత మృతి

సత్తెనపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని క్రిష్టియన్‌పేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గుజ్జర్లపూడి నాగేశ్వర రావు(70) శనివారం గృహంలో గుండె పోటుతో మృతి చెందారు. ఆయన కుమారుడు రాజు హైకోర్టులో ప్రభుత్వ ప్లీడర్‌గా పని చేస్తున్నారు. నాగేశ్వరరావు మరణ వార్త తెలుసుకున్న పలువురు టీడీపీ నేతలు ఆయన మృత దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టీడీపీ మాజీ కౌన్సిలర్ మృతి

సత్తెనపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 4వ వార్డు టీడీపీ మాజీ కౌన్సిలర్ షేక్ మాబూ సుభానీ(55) శనివారం అనారోగ్య కారణంగా మృతి చెందారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న పలువురు టీడీపీ నేతలు ఆయన మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు.

తిరునాళ్ళలో షాపుల నిర్వహణకు 29న వేలం ..

క్రోసూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరులోని వీరభద్ర స్వామి దేవాలయ ఆవరణలో ఈనెల 29 ఉదయం 11 గంటలకు గంగమ్మ తిరునాళ్ళ హక్కుల కోసం వేలం నిర్వహించనున్నట్టు దేవాదాయ శాఖ ఈవో కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అచ్చంపేట మండలం ఓర్వకల్లు గ్రామంలోని గంగమ్మ తల్లి తిరునాళ్ళ సందర్భంగా ఫిబ్రవరి 11 నుంచి 13 వరకు, మార్చి 13 నుంచి 15వతేదీ వరకు దేవస్థానం వద్ద వివిధ హక్కుల కోసం వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కొబ్బరి చిప్పల సేకరణకు, చీరలు, జాకెట్లు సేకరణకు, లడ్డు ప్రసాదం విక్రయానికి, కొబ్బరి కాయలు విక్రయానికి, చెప్పుల స్టాండ్ నిర్వాహణకు, ఐస్ క్రీమ్ విక్రయానికి వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రూ 10వేలు దరవత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

కోనూరులో నదిలో గాడి

అచ్చంపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాల మేరకు అచ్చంపేట తహసీల్దార్ పీ శ్రీనివాస్ శనివారం కోనూరు లోని కృష్ణానదిలో ఇసుక తోలకుండా ఉండేం దుకు గాడి కొట్టించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రవాహానికి అడ్డంగా ఉన్న రహదారికి గాడి కొట్టి ఇసుక అక్రమ రవాణా నిలిపి వేస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు.



కోనూరు ఇసుక రేవులో లారీలు వెళ్ళకుండా అధికారులు తవ్వించిన గాడి దృశ్యం

ప్రజాస్వామ్యంలో ఓటరే రారాజు

- జాతీయ ఓటర్ల దినోత్సవంలో వక్తలు
- వివిధ ప్రాంతాల్లో ర్యాలీలు, మానవహారాలు
- సీనియర్ సిటిజన్ ఓటర్లుకు ఘన సత్కారాలు

పిడుగురాళ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య దేశంలో ఓటరే రారాజని, 18 సంవత్సరాలు వచ్చిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కోసం నమోదు చేయించుకోవాని పిడుగురాళ్ల తహసీల్దార్ జే. మధు బాబు అన్నారు. శనివారం మండలంలోని జానపాడు గ్రామంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామస్థులు, పాఠశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. అలాగే మున్సిపల్ కార్యాలయం, జడ్పీ హైస్కూలు, సచివాలయాల పరిధిలో ఓటర్ల దినోత్సవం నిర్వహించి ఓటరచే ప్రతిజ్ఞచేయించారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ సుధాకరశర్మ, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీనుబాబు, సీఎస్ డీటీ సుబ్బారావు, సర్పంచ్ మర్యాదరావు, సాగునీటి సంఘం అధ్యక్షులు రాయపాటి ఆదయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

కొండమోడు కేఎస్ఆర్ విద్యాసంస్థలలో డైరెక్టర్లు కోనేరు నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావుల ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు.

మాచవరం, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం మాచవరంలో బీఎల్‌వోలు ప్రత్యేక టీ షర్టులు, టోపీలు ధరించి తహసీల్దారు కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటరు వద్ద మానవహారాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు, తహసీల్దార్ క్షమారాణి, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రెంటచింతలలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఎల్వోలు



జానపాడులో గ్రామస్తులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ మధుబాబు

దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గామాలపాడు శివారులోని ఆంధ్రా సిమెంట్స్ లిమిటెడ్ దుర్గా సిమెంట్ వర్క్స్ ఆధ్వర్యంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సీనియర్ సిటిజన్ ఓటర్లను సత్కరించారు.

మాచర్లటౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ జరిపారు. అధికారులు, సిబ్బంది బస్టాండ్ సెంటర్‌వద్ద మానవహారంగా నిలబడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఓటు ప్రాధాన్యత గురించి తహసీల్దార్ కిరణ్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వేణుబాబు, డీటీలు బత్తుల వాణి, వెంకటరమణ, ఆర్ఐ అనిల్‌కుమార్, రంగారావు, మెట్టు గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పునూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్ఎం ఐవీ నాగమణి ఓటు ప్రాముఖ్యం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ వీఆరాంజనేయులు, పౌలురాజు, అప్పారావు, శ్రీనివాసరావు, పెదయూసప్, నారాయణ, మధుబాబు పాల్గొన్నారు.

దుర్గి, (ఆంధ్రజ్యోతి): దుర్గిలో తహసీల్దార్ ఫణీంద్రకుమార్ ఆధ్వర్యాన జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ సెంటరు వద్ద మానవహారం నిర్మించారు.

రెంటచింతల, (ఆంధ్రజ్యోతి) : రెంటచింతలలోని ప్రధాన వీధుల్లో ఆర్ఐ పల్లా రామకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. యువత హెల్ప్‌లైన్ యాప్ ద్వారా నూతన ఓటర్లుగా నమోదు కావాలని ఆర్ఐ సూచించారు. అనంతరం బస్టాండ్ సెంటరులో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీటీ బ్రహ్మయ్య, సీనియర్ అసిస్టెంట్ నాసరయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెదకూరపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెదకూరపాడు, (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం పెదకూరపాడులో తహసీల్దార్ డానియేలు ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది ఓటరు అవగాహనర్యాలీ నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రోత్సాహక బహుమతులను అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, ఈవోపీఆర్‌డీ శరత్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ తులసీరామ్, వీఆర్‌వోలు, అంగన్‌వాడీలు, అభినందన కాలేజీ ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరావతి,(ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయంల వద్ద తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుతో పాటు రెవెన్యూ సిబ్బంది, స్థానికులతో కలసి ఓటు హక్కు అవగాహన ప్రతిజ్ఞ చేయించారు.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాయల ఇన్‌చార్జి తహసీల్దార్ హెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ కార్యాలయ అధికారులు క్రోసూరులో ర్యాలీనిర్వహించి మానవహారం ఏర్పాటుచేశారు. సీనియర్ సిటిజన్ ఓటర్లను సత్కరించారు. ఓటర్ల నమోదులో ఉత్తమ సేవలందించిన అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. క్రోసూరు హైస్కూల్లో ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంల హెచ్ఎం రామాంజనేయులు, సీహెచ్‌వో సాంబశివరావు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

- పశు సంవర్ధక శాఖ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ దామోదర నాయుడు

పెదకూరపాడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పశు పోషకులు పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోని పాల దిగుబడిని పెంచాలని పశు సంవర్ధక శాఖ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ టీ దామోదరనాయుడు సూచించారు. పెదకూరపాడులో కొమరాబత్తినిరోజమ్మ జ్ఞాపకార్థం శనివారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ గుడిపూడి రాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా దామోదరనాయుడు హాజరయ్యారు. క్యాంపు నిర్వాహకులు యూనియన్ బ్యాంక్ విశ్రాంత జనరల్ మేనేజర్ డాక్టర్ కేఎల్ రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని పశు రైతులకు ఈ పశు వైద్య శిబిరం ఎంతో ఉయోగంగా ఉంటాయని, గ్రామానికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ మాధవరావు, డాక్టర్ నరసింహారావు, డాక్టర్ కాంతారావు, పారిశ్రామికవేత్త సామినేని కోటేశ్వరరావు,యూనియన్‌బ్యాంక్ ఆర్ఎం జవహర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞానకేంద్రం ప్రతినిధి డాక్టర్ యుగంధర్, డాక్టర్ ముత్తారావు, డాక్టర్ విజయసారథి, విశ్రాంత వైద్యులు డాక్టర్ వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



దూడల యజమానులకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ దామోదరనాయుడు, డాక్టర్ రాజు

లేగ దూడల అందాల పోటీలు..

లేగ దూడల అందాల పోటీల్లో విజేతలైన దూడల యజమానులకు నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులను అందించారు.



చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు

బెల్లంకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డి ఎంపీపీ, బీసీ అంగన్‌వాడీకేంద్రంలో చిన్నారులకు శనివారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా, డెంగీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం చిన్నారులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రేవతి, హనుమంతరావునాయక్, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో యూరియా

నకరికల్లు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని ఏవో కే దేవదాసు తెలిపారు. గుండ్లపల్లి, చల్లగుండ్ల, దేచవరం, కుంకలగుంట, రూపెనగుంట్ల, కండ్లకుంట, చీమలమర్రి రైతు సేవా కేంద్రాల్లో 140 టన్నుల యూరియా సిద్ధంగా ఉందన్నారు. రబీలో సాగు చేస్తున్న పంటల వివరాలను రైతు సేవా కేంద్రాల్లో ఈ పంట నమోదు చేయించుకోవాలని ఏవో రైతులకు సూచించారు. కార్యక్రమంలో వీఏఏ ఎండీ జాన్ అహమ్మద్, పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రక్కు బోల్తా

- ఆరుగురు కూలీలకు గాయాలు

రెంటచింతల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మిర్చి గోతాల లోడుతో పొలం నుంచి వస్తున్న ట్రక్కు బోల్తా పడిన ప్రమాదంలో కూలీలు గాయపడిన ఘటన శనివారం మండలంలోని పశర్లపాడు గ్రామ శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు ఓ ట్రాక్టరు మిర్చిగోతాల లోడుతో వస్తుండగా డ్రైవరు సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ట్రక్కులోని గోతాలపై కూర్చున్న కూలీలు కిందపడిపోగా వారిపై మిర్చి గోతాలు పడ్డాయి. ఈ ఘటనలో కాంతా, సౌందర్య, హనిమి, బుజ్జి, విజయ, పార్వతిలకు గాయాలయ్యాయి. వారిని మాచర్ల పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

స్టడీ మెటీరియల్ అందజేత

వెల్దుర్తి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూలు, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలు, మోడల్ స్కూల్స్‌లలో శనివారం పదో తరగతి విద్యార్థులకు ఎస్టీయూ స్టడీ మెటీరియల్‌ను శ్రీతులసీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించేందుకు ఈ స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూపల్లి గంగాధరబాబు, కృష్ణ, హరినాయక్, వెంకటేశ్వర్లు, గురవయ్య, హెచ్ఎం రంగరాజు, భాస్కరరావు, పద్మావతి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను వినియోగించు కోవాలి

నకరికల్లు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో విద్యార్థుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఈవోపీఆర్‌డీ కేవీ శివ ప్రసాదు కోరారు. ఈనెల 27, 28 తేదీల్లో కండ్లకుంట అంగన్‌వాడీ కేంద్రంలో, 29,30 తేదీల్లో కుంకలగుంటలోని అంగన్‌వాడీకేంద్రంలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ పడాలశాంతి, వీఆర్‌వో పాశం శారదా, ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య, మాజీ సర్పంచ్ సంగుల కొండలు తదితరులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్‌లో అధికారుల భోజనం

సత్తెనపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అన్నక్యాంటీన్‌లో శనివారం మునిసిపల్ కమిషనర్ షమ్మి, మేనేజర్ నెట్టెం సాంబశివరావు, ఇతర అధికారులు, సిబ్బంది భోజనంచేశారు. క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ప్రజలతో కమిషనర్ మాట్లాడుతూ ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత గురించి అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్‌సిబ్బంది అందిస్తున్న సేవల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు.



జగనన్న కాలనీలో పర్యటిస్తున్న సీఐ భాస్కర్

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- సీఐ భాస్కర్ హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గురజాలటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ భాస్కర్ హెచ్చరించారు. పట్టణంలోని జగనన్న కాలనీల్లో అసాంఘిక కార్యకలాపాలపై 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈమేరకు కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సీఐ భాస్కర్ మాట్లాడుతూ కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాల్లో, వీధులవెంట మద్యం తాగుతూ కనిపిస్తే కేసులు నమోదు చేస్తాని హెచ్చరించారు. అనంతరం కాలనీలో డ్రోన్ కెమెరాతో నిఘా నిర్వహించారు.

క్షత గాత్రులను ఆస్పత్రికి తరలిస్తే ప్రోత్సాహం

సత్తెనపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రికి తరలించిన వారికి ప్రభుత్వం తగిన పారితోషకాన్ని అందజేస్తుందని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు శనివారొ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు సంవత్సరాలక్రితం గుడ్ సమ్మరిటన్ పేరిట ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా బాధితులను ఆస్పత్రిలో చేర్పిస్తే ప్రభుత్వం రూ 5 వేలు ఇచ్చేదని, ఇక నుంచి రూ.25 వేలు అందజేయనున్నట్లు కేంద్రం తాజాగా ప్రకటించిందన్నారు. దానికి సంబంధించిన మార్గదర్శకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని డీఎస్పీ తెలిపారు.

తిరునాళ్ల ప్రారంభం

పిడుగురాళ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజాశక్తినగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి కల్యాణం, రథోత్సవ తిరునాళ్ల మహోత్సవ కార్యక్రమాలకు శనివారం అంకురార్పణ జరిగింది. విష్ణు సహస్రనామ, స్తోత్రపారాయణం, రక్షాబంధన్ కార్యక్రమాలు ప్రారంభించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు కాకుమాను మల్లికార్జునరావు, కమిటీ సభ్యులు, భక్తులు ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు

- సర్వర్‌తో అనుసంధానం లేక పోవటమే కారణం
- పీహెచ్‌సీలో కొరవడిన సాంకేతిక నిఘా..

సత్తెనపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసిన నిఘానేత్రాలు అలంకార ప్రాయంగా మారాయి. 2003 లో వైసీపీ ప్రభుత్వహయాంలో లక్షలాది రూపాయలు వ్యయంతో జిల్లాలోని 38 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ఏర్పాటుచేసిన కెమెరాలన్నీ నిరుపయోగంగావున్నాయి. అన్నిచోట్ల సీసీ కెమెరాలున్నా వాటిని ప్రధాన సర్వర్‌తో అనుసంధానం చేయకుండా వదిలివేశారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులు, అక్కడి వైద్యులు, సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న సేవలు పరిశీలించేందుకు ప్రతి ఆరోగ్యకేంద్రంలో నాలుగైదు సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. అనంతరం సీసీ కెమెరాల పనితీరు గురించి పట్టించుకున్న వారు లేకపోవటంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సీసీ కెమెరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంతో అనుసంధానం చేయలేదు. ఈ విషయంపై డీఎంహెచ్‌వో డాక్టర్ రవిని వివరణ కోరగా ఆరోగ్యకేంద్రాల్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను ప్రధానకార్యాలయంతో అనుసంధానించక పోవడంతో పర్యవేక్షణ కొరవడిందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు.



ఫణిదం పీహెచ్‌సీలో నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు

ఒక్క ఫోన్‌కాల్‌తో ఇంటి వద్దకే సేవలు

- మునిసిపల్ కమిషనర్ షమ్మి

ఫటా ఫట్



సత్తెనపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఇకపై ఇంట్లోని ఎలక్ట్రానిక్, ప్లంబింగ్ సంబంధిత వస్తువులు పాడైతే మరమ్మతులకు వృత్తి దారులను తెతుక్కోవాల్సిన అవసరం లేకుండా సేవలన్నింటినీ ఒకే గొడుగు కిందకు ప్రభుత్వం తీసుకు వస్తుందని మునిసిపల్ కమిషనర్ షమ్మి శనివారం తెలిపారు. ఇందుకోసం మెప్మా ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్‌ను రూపొందించి చేతి వృత్తిదారులతో పలు సేవలను అందించటానికి చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. సర్వీస్ ప్రొవైడర్స్ పేరుతో వృత్తి దారుల వివరాలను దరఖాస్తుల రూపంలో తీసుకొని యాప్‌లో పొందు పరచి ఒక్క ఫోన్ కాల్‌తో ఇంటి వద్దకే టెక్నీషియన్స్‌ని పంపటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాలపై కమిషనర్‌తో ఫటాఫట్ ఇంటర్వ్యూ..

ప్రశ్న : సర్వీస్ ప్రొవైడర్స్ ద్వారా ఎటువంటి సేవలు అందిస్తారు?

కమిషనర్ : ఇప్పటి వరకు పెద్ద నగరాలకు మాత్రమే పరిమిత మైన ఈ తరహా సేవలను పట్టణంలో మెప్మా ద్వారా అందించనున్నాం. ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్, బ్యూటీషియన్ తదితర వృత్తి నిపుణులను గుర్తించి నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇస్తాము. శిక్షణ పొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తాం.

ప్రశ్న : ఏ సంస్థ ద్వారా సేవలు అందిస్తారు?

కమిషనర్ : హైదరాబాద్‌కు చెందిన హోం ట్రయాంగిల్ సంస్థ ప్లాట్ ఫాం ద్వారా ఆన్‌లైన్‌లో సేవలు అందిస్తాం. తద్వారా అటు ప్రజలకు సకాలంలో ఇంటి నిపుణులను ఇంటి ముగింటకు పంపటమే కాకుండా వృత్తి దారులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మెప్మా అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రశ్న : పట్టణంలో ఎంత మంది సర్వీస్ ప్రొవైడర్స్‌ను గుర్తించారు? వారికి నెలకు ఎంత ఆదాయం వస్తుంది?

కమిషనర్ : పట్టణంలో వంద మంది వివిధ వృత్తి దారులను గుర్తించాం. శిక్షణకు ఎంపికైన వృత్తి దారులకు నెలకు రూ.15 వేలకు తగ్గకుండా ఆదాయాన్ని కల్పించటమే లక్ష్యం.



రోడ్డు భద్రత వారోత్సవాల ప్రతులను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరెడ్డి తదితరులు

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి

- ఆర్‌అండ్‌బి చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి

పిడుగురాళ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలను తప్పక పాటించాలని ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ ఎల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 32వ జాతీయ భద్రత వారోత్సవాల కార్యక్రమాన్ని శనివారం తుమ్మల చెరువు టోల్‌ప్లాజా వద్ద నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చీఫ్ ఇంజనీర్ మాట్లాడుతూ రాష్ట్ర రహదారిపై ప్రయాణిస్తున్న ట్రక్కులకు రేడియం స్టిక్కర్స్ అందించడం, వాహనదారుడు సీటు బెల్టు పెట్టుకునేలా అవగాహన కల్పించడం వంటివి చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం బైపాస్ రోడ్డులో రెండవ ఆర్‌వోబీని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, ఈఈ రాజా నాయక్, ఏఈ యూసఫ్, నామ్‌వే ఎక్స్‌ప్రెస్ ప్రతినిధులు శ్రీకాంత్‌బాబు, ప్రసాద్, ముఖేష్, తదితరులు పాల్గొన్నారు.

తంగెడ రహదారిని పరిశీలించిన ఆర్‌అండ్‌బీ సీఈ

దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి) : తెలంగాణా - ఆంధ్రా రాష్ట్రాలకు అనుసంధానం చేస్తున్న తంగెడ రహదారి మరమ్మతులకులోనై రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండటంతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే నిమిత్తం ఏపీ రోడ్డు రవాణా శాఖ చీఫ్ ఇంజనీరు శ్రీనివాసరెడ్డి, పల్నాడుజిల్లా ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాస మూర్తిలు, తేటి శాఖ అధికారులతో కలసి ఆ రహదారిని పరిశీలించారు. దాచేపల్లి నుంచి తంగెడకు 16 కిలో మీటర్లు రహదారి ఉంది. ఈ రహదారి నిర్మాణానికి సంవత్సర కాలం క్రితమే రూ.5.7 కోట్లు నిధులు మంజూరయ్యాయి. కానీ ఇంత వరకు పనులు చేపట్టలేదు. రహదారి పరిస్థితి గురించి స్థానికులు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకు వెళ్ళారు. ఈ విషయంపై ఆయన వీలైనంత త్వరగా రహదారి నిర్మాణ పనులను చేపట్టాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ నేపథ్యంలో సీఈ స్థానిక అధికారులతో కలిసి ఆయా రహదారిని పరిశీలించారు. కార్యక్రమంలో మాచర్ల డీఈఈ రమణయ్య, దాచేపల్లి ఏఈ దుశ్యంత్ సుబ్బారావులు ఉన్నారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ

కారంపూడి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కారంపూడి తహసీల్దారుగా నియమితులైన వెంకటేశ్వర్లు నాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు నాయక్ తహసీల్దార్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నేతలు మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఉన్నం లక్ష్మీనారాయణ, నాగులనాయక్, నాగవరపు రాముడు, పలిశెట్టి రాఘవ, బ్రహ్మం, టీహెచ్ జాని తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత గ్రామాలే లక్ష్యం

పెదకూరపాడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, గృహ హింస లేని గ్రామాలే సురక్షిత గ్రామాలని ల్యాంప్ సంస్థ కో-ఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని 75 తాళ్ళూరు శాంతి కాలనీలో షై చాయిస్ ఫౌండేషన్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామజ్యోతి పేరుతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్ వాడీ సూపర్ వైజర్ షేక్ మున్నీ మాట్లాడుతూ బాల్యవివాహాలు అనర్థమని, పైగా నేరమని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూతం నరసయ్య, జైశ్రీ, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ షేక్ బాజీ, గుత్తికొండ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఫసల్ బీమాతో రైతులకు మేలు

అచ్చంపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో అర్హత పొందిన రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా జేడీ కార్యాలయ ఏఎస్‌వో టీ మధుసూదనరావు అన్నారు. శనివారం అచ్చంపేట మండల పరిధిలోని చామర్రు గ్రామంలో వరి పంట కోతపై ప్రయోగాలు చేశారు. ఈ ప్రయోగాలను అన్ని గ్రామాల్లోని సరాసరి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. ప్రతి గ్రామంలో రెండు లేక నాలుగు పంట కోతల పై ప్రయోగాలు చేస్తామని, చేపడితే వచ్చిన సరాసరిని ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో పంట నష్టం అంచనా వేసేందుకు పంట కోత ప్రయోగం తోడ్పడుతుందని తెలిపారు. పంట కోత ప్రయోగంలో వీపీఏ బిల్లా రహీం, ఎం మాన్యానాయక్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా భూరక్ష హద్దురాళ్లు

అమరావతి, జనవరి25: గత ప్రభుత్వ హయాంలో గ్రామాలలో నిర్వహించిన భూ రీసర్వేకు సంబంధించి జగనన్న భూరక్ష పేరుతో మండలాలకు కేటాయించిన గ్రానైట్ హద్దురాళ్ల ప్రస్తుతం మండలంలో నిరుపయోగంగా పడిఉన్నాయి. కూటమి ప్రభుత్వం మండలంలో నాలుగు రోజుల క్రితం భూ రీసర్వేను ప్రారంభించి ముందుగా నరుకుళ్లపాడు గ్రామాన్ని ఎంపిక చేసింది. ఒక పక్క రీసర్వే జరుగుతున్నప్పటికి దానికి సంబంధించి హద్దురాళ్ల వేయాల్సి ఉంది. దీనిపై సర్వేయర్ భాగ్యలక్ష్మిని వివరణ కోరగా గత ప్రభుత్వంలో కేటాయించిన రాళ్లపై ఉన్న జగనన్న పేరును తొలగించి ఆ రాళ్లను వినియోగించడము జరుగుతుందని త్వరలో ఆకార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలియజేశారు.

పల్నాడు వార్తలు

నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

రేషన్ బియ్యం సక్రమంగా అందించాలి : తహసీల్దార్

నూజెండ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు సకాలంలో అందించాలని తహసీల్దార్ జీ.రమేష్ కుమార్ బియ్యం పంపిణీ వాహనాల నిర్వాహకులకు, డీలర్లకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం రేషన్ డీలర్లకు, ఎండీ ఆపరేటర్లకు సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా నగదు ఇవ్వటం, రేషన్ బియ్యం కొనుగోలు చేయటం నేరమవుతుందని హెచ్చరించారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకున్నామని, అక్రమాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని వినతి

రొంపిచర్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచవరంలో ఉన్న యూపీ పాఠశాలను 10వ తరగతి పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యే అరవిందబాబుకు శనివారం వినతిపత్రం అందజేశారు. దీనివల్ల నలగార్లపాడు, దాసరిపాలెం, పరగటిచర్ల గ్రామాల విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యాంపాటి కోటిరెడ్డి, పోతిరెడ్డి అంజిరెడ్డి, అబ్రహం, అంజిరెడ్డి పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్‌కు సన్మానం

మండలంలోని రొంపిచర్ల గ్రామంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్‌కు సన్మానం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మొండితోక రామారావు, పడాల చక్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మండలంలోని రెడ్డిపాలెం సమీపంలో ఈనెల 19వ తేదీన ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన చట్టు విష్ణు గాయపడ్డాడు. నరసరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఈనెల 21వ తేదీన మృతి చెందినట్టు పోలీసులు శనివారం తెలిపారు. అతని తండ్రి చట్టు వెంకటశివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

వంట గది ప్రారంభోత్సవం

మండలంలోని రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో వంటగదిని శనివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన అర్వపల్లి ప్రసాదుబాబు కుమారుడు అర్వపల్లి మనోహర్ రూ.7 లక్షల వ్యయంతో పాఠశాలలో డైనింగ్ హాల్, వాటర్ షెడ్డు, ట్యాంక్, నిర్మించారు. రూ.50వేలు విలువ చేసే క్రీడా సామగ్రిని అందజేశారు. హెచ్‌ఎం సుభానీ మాట్లాడుతూ పూర్వవిద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకరించటం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈ సందర్భంగా మనోహర్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఇట్టే ఏడుకొండలు, పడాల చక్రారెడ్డి, మొండితోక రామారావు, సైదయ్య, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్ళు

శావల్యాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్లు మండల ఇన్‌చార్జి వ్యవసాయ శాఖాధికారి రామినేని రామారావు తెలిపారు. శావల్యాపురంలో రైతులు విక్రయిస్తున్న ధాన్యాన్ని వ్యవసాయ శాఖాధికారులు శనివారం పరిశీలించారు. రామారావు మాట్లాడుతూ మండలంలోని గుంటుపాలెం, పిచికలపాలెం, శావల్యాపురం, కొత్తలూరు క్లస్టర్ల పరిధిలో 1100 టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఏఈవో పూరేటి అశోక, వీఏఏ జెస్సీ పాల్గొన్నారు.

విద్యార్థుల అవగాహనా ర్యాలీ

నాదెండ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనపర్రులో ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవంపై శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. 'ఓటు హక్కు మన అందరి బాధ్యత' అనే నినాదంతో విద్యార్థులు,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఈర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రిన్సిపాల్ డాక్టర్ నాగ మల్లేశ్వరరావు, ఎండీ మస్తాన్ షరీఫ్, ఎన్ఎస్ఎస్ పీవో గంగాధరరావు, కరస్పాండెంట్ కరీమొహిద్దీన్ పాల్గొన్నారు.

నేడు మాంసం విక్రయాలు జరిపితే చర్యలు

చిలకలూరిపేట టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గణతంత్ర దినోత్సవం రోజున పురపాలక సంఘ పరిధిలో జంతువధ, మాంసం విక్రయాలు నిషేధించినట్లు మునిసిపల్ కమిషనర్ హరిబాబు తెలిపారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

స్థానిక ఆర్‌వీఎస్‌సీవీఎల్ హైస్కూల్ విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సేవా సమితి ఆధ్వర్యంలో పరీక్షకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. 1996 - 97 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు కరోనా సమయంలో కూడా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని హెచ్‌ఎం వెంకటేశ్వరరావు తెలిపారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

రొంపిచర్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఈనెల 21వ తేదీ నుంచి పశు వైద్యశిబిరాలు జరుగుతున్నాయి. కాగా ఈ శిబిరాలను సద్వినియోగించుకోవాలని కర్లకుంట పశు వైద్యాధికారి ఆవుల సాయి మహేష్‌రెడ్డి శనివారం తెలిపారు. కొన కంచివారిపాలెం, మాచవరం గ్రామాల్లో ఈ శిబిరాలు జరిగాయి. పశువులకు, గొర్రెలకు, కోళ్ళకు టీకాలను వేశారు. అదేవిధంగా ఉచితంగా మందులు అందజేశారు.

వడ్డెంగుంట ఆలయంలో చోరీ

బొల్లాపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్డెంగుంట గ్రామంలో పాటి పాటెమ్మ పోలేరమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ఆలయంలోని హుండీని పగలగొట్టి సుమారు రూ.రెండు లక్షల కానుకలు చోరీ చేసినట్టు గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

నరసరావుపేట టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో శనివారం జాతీయ ఓటర్ దినోత్సవ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ సుధీర్ కుమార్

సందర్భంగా ప్రిన్సిపాల్ ఎంఎస్ సుధీర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది జనవరి 25న జాతీయ ఓటర్ల దినో త్సవం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీ శ్రీనివాససాయి, ఎం అనిల్‌కుమార్, సదాశివరెడ్డి, ఆర్ వేణుమాధవ్, పీ రాంబాబు, పీ శ్రీనివాసులు, బీ చిన్నపరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

● స్థానిక పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఓటర్లు దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ సీహెచ్ మల్లికార్జున్, డిప్లమా ప్రిన్సిపాల్ కే కృష్ణారెడ్డి, డీన్ ఏ కిషోర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈపూరులో..

ఈపూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఈపూరులో ఓటర్ల దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తహసీల్దారు ఏ.నళిని, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య, అయినాల కోటేశ్వరరావు, బొల్లా సుబ్బారావు, బెల్లంకొండ సైదులు, మద్దం కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కమిషనర్ సుబాష్‌చంద్రబోస్, వినుకొండ స్పెషల్ ఆఫీసర్ శ్రీరాములు ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీ మురళి, మున్సిపల్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక గడియార స్తంభం సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి



చిలకలూరిపేటలో నిర్వహిస్తున్న ర్యాలీ

రాచూరి రమేష్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకుడు ఆనందరావుతో సహా పలువురు సీనియర్ సిటిజన్లను సత్కరించారు. చిలకలూరిపేటలో నిర్వహించిన సభలో తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ పీ శ్రీహరిబాబు, డిప్యూటీ తహసీల్దార్ ఏ వెంకటేశ్వర్లు, మున్సిపల్ టీపీఎస్ కే సుజాత, లోక్‌సత్తా నాయకులు మాదాసు భానుప్రసాద్ పాల్గొన్నారు. మండలంలోని పసుమర్రు హైస్కూల్‌లో సీనియర్ సిటిజన్ జక్కంపూడి సీతారామారావును సత్కరించారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో తహసీల్దార్ ఏ.సుధాకర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామంలోని టీడీపీ నాయకులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సన్మాన గ్రహీతలు కానాల కోటిరెడ్డి, నాగన బోయిన పాపులు, పాలం వెంకట కోటయ్య, బెల్లంకొండ పెద కోటయ్యను పూలమాలలు, శాలువాలతో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.

నూజెండ్లలో...

నూజెండ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అధికారులు, బీఎల్‌వోలు ఓటరు దినోత్సవంలో పాల్గొన్నారు. తహసీల్దార్ జీ రమేష్ కుమార్, నాయకులు, పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పెద్దవరంలో పాఠశాల హెచ్‌ఎం జీ నాగేశ్వర రావు ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లగడపాటి సూరి బాబు, గంగినేని బ్రహ్మయ్య, శ్రీరామినేని సుబ్బారావు, మేదరమెట్ల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడులో..

యడ్లపాడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రతి పోలింగ్ కేంద్రంలో సీనియర్ సిటిజన్‌లను, నూతనంగా ఓటు హక్కు పొందిన వారిని గుర్తించి సన్మానించారు. యడ్లపాడు లూథరన్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఏఈఆర్‌వో, తహసీల్దార్ జె విజయశ్రీ పాల్గొని సీనియర్ సిటిజన్లను, నూతన ఓటర్లను సత్కరించారు. సొలస, కారుచోల, గుత్తావారిపాలెం, తిమ్మాపురం, లింగారావుపాలెం, కొండవీడు, చెంఘీజ్‌ఖాన్‌పేట, ఉన్నవ, వంకాయలపాడులోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో డీటీ అనూరాధ, ఆర్ఐ సుబ్బారావు, బీఎల్వోలు శశికళ, చారి, మోహనరావు, బాబూరావు, శివకోటేశ్వరరావు, బాషా, ఎండి రఫి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : జూనియర్ సివిల్ జడ్జి

ఈపూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వినుకొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహతి అన్నారు. మండలంలోని ఇనుమెళ్ళ గ్రామంలో శనివారం సాయంత్రం న్యాయ సేవా సదస్సు జరిగింది. సదస్సులో జడ్జి మహతి ముఖ్య అతిథిగా హాజరై చట్టాల గురించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు.సదస్సులో ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు, న్యాయవాదులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మహతి

మంత్రి నిమ్మలను కలిసిన టీడీపీ మండల నాయకులు



జలవనరుల శాఖ మంత్రిని కలసిన టీడీపీ నాయకులు

నూజెండ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో పూర్తి చేసిన నీరు చెట్టు పథకం ద్వారా చెక్ డ్యామ్‌లకు బిల్లుల బకాయిలు ఇప్పించాలని ములకలూరు డీసీ చైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు కుంటా కోటిరెడ్డి, అనుమోలు మల్లారెడ్డి శనివారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలసి వినతి పత్రాన్ని అందజేశారు. గోదావరి జలాలను సాగర్ కుడి కాలువ ద్వారా అం దించేందుకు చేపట్టిన హరిశ్చంద్రపురం ఎత్తిపోతల పథకం, నకరికల్లు, బొల్లాపల్లి రిజర్వాయర్ చేపట్టడం ద్వారా వినుకొండ ప్రాంతానికి మేలు జరుగుతుందన్నారు.

రెండు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు

ఉన్నవ(యడ్లపాడు), జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పశుసంపదను పెంచేందుకు టీడీపీ ప్రభుత్వం పలు ప్రోత్సాహాలను కల్పిస్తూ పశుపోషకులకు అండగా నిలుస్తోందని జీడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ కుర్రా రత్తయ్య అన్నారు. మండలంలోని ఉన్నవ, సందెపూడి గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను శనివారం నిర్వహించారు. ఉన్నవలో శిబిరానికి రత్తయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 31 వరకు 10 రోజుల పాటు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో వీఏఎస్ డాక్టర్ బేగం పాల్గొని పశువులకు పరీక్షలు నిర్వహించారు. 42 గేదెలకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. 24 దూడలకి, 300 గొర్రెలకి నట్టల నివారణ మందులను అందజేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర గర్నా లక్ష్మీనారాయణ, వంకాయలపాడు నీటి సంఘం అధ్యక్షుడు ఇడుపులపాటి సాయిబాబు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాకుమాను శ్రీను తదితరులు పాల్గొన్నారు. సందెపూడిలో జరిగిన ఆరోగ్య శిబిరంలో జగ్గాపురం పశువైద్యశాల వీఏఎస్ డాక్టర్ పీ కిరణ్మయి పాల్గొని వైద్యసేవలు అందించారు.

బొల్లాపల్లి మండలంలో..

బొల్లాపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరూరుపాడు, మూగచింతలపాలెం గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో మూగచింతలపాలెం గ్రామంలో 993 గొర్రెలు, మేకలు, 23 ఎద్దులు, ఆవులు, గేదెలు, 62 దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. పేరూరుపాడులో పశువులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం పశు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గంగినేని రమణయ్య, బొప్పూడి శ్రీనివాస్, గుర్రం నరసింహారావు, కాట్ల వెంకటేశ్వర్లు, రాచపల్లి ఏడుకొండలు, కాసరగడ్డ హనుమంతరావు, పిట్టల గోవిందు, డాక్టర్ రేవతి, అసిస్టెంట్ కోటయ్య, అత్తులూరి హనుమంతరావు, నాసర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వెల్లటూరు విద్యార్థికి కలెక్టర్ ప్రశంసాపత్రం

బొల్లాపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లటూరు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో చదువుతున్న ఎం.లీలా నాయక్ జిల్లా స్థాయిలో ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పాటల పోటీల్లో తృతీయ స్థానం, డిబేట్‌లో ద్వితీయ బహుమతి, ప్రశంసాపత్రం శనివారం కలెక్టరేట్‌లో జరిగిన ఓటరు దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పీ.అరుణ్ బాబు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అలీషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

గణపవరం విద్యార్థుల ప్రతిభ



కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

నాదెండ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గణపవరంలో కెల్లంపల్లి భద్రా చలం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని 'నథింగ్ లైక్ ఓటింగ్, ఐవోట్ ఫర్ ష్యూర్' అనే అంశంపై పల్నాడు జిల్లా స్థాయిలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు పీ జగన్‌మోహన్‌రెడ్డి, హిమ ఆదిత్య, వక్తృత్వ పోటీల్లో ఎం పూర్ణిమ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వారికి కలెక్టర్ పీ అరుణ్‌బాబు బహుమతులు పంపిణీ చేశారు.

వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏపీపీగా ముప్పాళ్ళ



ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు

వినుకొండటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావు వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా శనివారం నియమితులయ్యారు. కోర్టు ఆవరణలో వినుకొండ న్యాయవాదుల సంఘం ఆయనను దుశ్శాలువాలతో పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఏపీపీ జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం తరుపున ప్రజలకు తన సేవలను నిస్వార్థంగా పని చేస్తానని, ఈ పదవికి మంచి గౌరవం వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో గౌరవప్రదమైన పదవిని కేటాయించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుతోపాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వినుకొండ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కేఎస్‌ఎంవీ నాయుడు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొని అభినందించారు.

కూటమి ప్రభుత్వంతో పేదలు వైద్యవిద్యకు దూరం : గోపిరెడ్డి



నరసరావుపేట రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్టంలో కూటమి ప్రభుత్వం వైద్యరంగాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల నిర్మాణంపై శీతకన్ను వేసిందని ఆరోపించారు.

జిల్లాస్థాయి పోటీల్లో సత్తాచాటిన వేల్పూరు విద్యార్థులు



కలెక్టర్ చేతులమీదుగా బహుమతిని అందుకుంటున్న శివల్లి

వేల్పూరు(శావల్యాపురం)జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నరసరావుపేటలోని భువన చంద్ర టౌన్‌హాలులో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి లఘునాటిక, పాటల పోటీల్లో శావల్యాపురం మండలం వేల్పూ రు జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తాను చాటి ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించినట్లు పాఠశాల గైడ్ టీచర్ జ్యోతి శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వేల్పూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు సాయికృష్ణ, వివేక్, నందు, ధనుష్, కైలాస్, అజయ్, అశోక్, సంజయ్ ఓటు హక్కు ప్రాముఖ్యత తెలియజేసేలా అందరూ ఓటెయ్యాలి అన్న లఘునాటికను ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలిచారని, పాటల పోటీల్లో పాఠశాల విద్యార్థిని యారం శ్రీహేమలత ఓటుహక్కును వినియోగించుకో అన్న పాటపాడి ద్వితీయస్థానంలో నిలిచినట్లు తెలిపారు. విజేతలను కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్డీవో మధులత అభినందించి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేసినట్లు చెప్పారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు : నోడల్ ఆఫీసర్



మూలనపడ్డ మిషన్‌లను పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్ హనుమకుమార్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

శావల్యాపురం, జనవరి 25 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సిబ్బంది విధులలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా నోడల్ ఆఫీసర్ హనుమకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో శనివారం ప్రచురితమైన అస్తవ్యస్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణ అన్న కథనానికి స్పందించిన జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోడల్ ఆఫీసర్ శావల్యాపురం పీహెచ్‌సీలో తనిఖీలు చేపట్టారు. ల్యాబ్ పరీక్షల మిషన్లు మూలనపడినా మరమ్మతులెందుకు చేయించలేదని వైద్యాధికారి రాధాకృష్ణన్‌ను ప్రశ్నించగా టెక్నికల్ సిబ్బందికి సమాచారం అందించినా స్పందించలేదని చెప్పడంతో వెంటనే టెక్నికల్ సిబ్బందికి ఫోన్ చేసి రెండ్రోజుల వ్యవధిలో మిషన్‌లకు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. హెల్త్ సూపర్‌వైజర్లు ఫీల్డ్‌కి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించగా సీహెచ్‌వో అనారోగ్య కారణాలతో సెలవు పెట్టారని, పబ్లిక్ హెల్త్ నర్స్ కూడా కొరత ఉండ డంతో రోజూ వారి రిపోర్టులు పంపేందుకు హెల్త్ సూపర్‌వైజర్ కార్యాలయంలోనే ఉండాల్సి వస్తుందని తెలిపారు. విషయాన్ని డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్ళి త్వరలో పరిష్కరిస్తామని, అప్పటివరకు పీహెచ్‌సీ సిబ్బంది సర్దుబాటు చేసుకొని విధులు నిర్వహించాలని హనుమకుమార్ తెలిపారు. అనంతరం హనుమకుమార్ మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు క్యాన్సర్ పరీక్షలు, స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా పిల్లలకు సకాలంలో వైద్యపరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు అందజేయాలన్నారు.

పీఎస్ ఖాన్‌ను పరామర్శించిన బొల్లా

వినుకొండటౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల బులెట్ వాహనాన్ని దగ్ధం చేసిన కేసులో జిమ్ జాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు 30 మంది ముస్లిం మైనార్టీకి చెదిన యువకులను పట్టణంలోని సబ్ జైలులో ఉంచారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, న్యాయవాది ఎంఎన్ ప్రసాద్‌తో కలిసి జైలులో ఉన్న ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు పీఎస్ ఖాన్, యువకులను ములాఖత్‌లో శనివారం పరామర్శించారు. అనంతరం బొల్లా సబ్ జైలు వద్ద విలేకర్లతో మాట్లాడుతూ నేడు పోలీస్ వ్యవస్థలో ప్రజలు స్టేషన్‌కు వెళ్ళి తమ సమస్యను చెప్పుకోలేకపోతున్నారని అన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తి ఇంటింటికి చేరాలి : జీవీ



జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్ళు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఇకనైన ఆ స్ఫూర్తి ఇంటింటికి చేరాల్సిన సమయం ఆసన్నమైందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ ఈ సందర్భంగా గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఉండబట్టే నియంతలు, అరాచక శక్తులకు ఎదురొడ్డి ప్రజాస్వామ్యం మనగలుగుతుందన్నారు.

నరగాయపాలెంలో పశు వైద్య శిబిరం

వినుకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పాడిపశువులు ఉన్న రైతులు పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వినుకొండ ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ సరోజని తెలిపారు. మండలంలోని నరగాయపాలెం గ్రామంలో పశువైద్య శిబిరాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ యర్రం ఆంజిరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 50 గేదెలకు గర్భకోశ, చూడి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 200 పాడి పశువులకు, గొర్రెలు, మేకల దారులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంబులెన్స్ డాక్టర్ ఎం.మనోజ్, స్థానిక పశువైద్య సిబ్బంది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న శాంతి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల డిప్లమా విద్యార్థులు ఈనెల 28, 29, 30 తేదీల్లో విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడలు, గేమ్స్‌మీట్‌కు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ కే కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. జిల్లా స్థాయి క్రీడల్లో 400, 1500 మీటర్ల పరుగుపందెంలో అద్భుత ప్రతిభ కనబరిచా రన్నారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ సీహెచ్ మల్లికార్జున్, డీన్ ఏ కిషోర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ సురేష్‌కు పురస్కారం



సీఎస్ విజయానంద్ నుంచి అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ సురేష్

వినుకొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడలో ఓ కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ చేతులమీదుగా వినుకొండ తహసీల్దార్ సురేష్‌కు ఉత్తమ అసి స్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఏఈఆర్‌వో)గా అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను దుశాలువాలతో ఘనంగా సన్మానించి అభి నందించారు. సురేష్‌ను జిల్లా రెవెన్యూ అధికారులతోపాటు వినుకొండ తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వండి : సీపీఐ డిమాండ్

చిలకలూరిపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా గృహాల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ మారుతీ వరప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల నివేశన స్థలాల అర్జీలను ఫిబ్రవరి 10న కలెక్టర్ కార్యాలయంలో అందజేయనున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 9న మండలం లోని వేలూరులో అమరవీరుల స్థూపం వద్ద అమరజీవి బొంతా దానియేలు వర్ధంతి నిర్వహించనున్నట్లు ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు తెలిపారు.

నాదెండ్ల ఉపసర్పంచ్ రామారావు గుండెపోటుతో మృతి



నాదెండ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : నాదెండ్ల పంచాయతీ ఉప సర్పంచ్ పాటిబండ్ల రామారావు(65) గుండెపోటుతో శనివారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రామారావు మృతిపై టీడీపీ సమన్వయకర్త సదాశివరావు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన భౌతిక కాయానికి అంతిమ కార్యక్రమం నిర్వహించారు.